క్లుప్తంగా

ఆలయానికి విరాళం



ఆలయ ఛైర్మన్‌కు హారం అందజేస్తున్న దాతలు

పీలేరు రూరల్: మండలంలోని కోటపల్లె జీవీన గర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి పుష్పాల పురుషోత్తం, ఆయన కుమారుడు హర్షవర్ధన్, కోడలు సౌజన్య, అల్లుడు కిరణ్‌కుమార్, కుమార్తె హరి తప్రియ దాతలు లక్ష్మీకాసుల హారం విరాళం ఇచ్చారు. గురువారం కుటుంబ సమేతంగా విచ్చేసి ఆలయ ఛైర్మన్ జి.వి.శ్రీనాథరెడ్డికి వారు హారం అందజేశారు.

కాన్షీరామ్ వర్ధంతి



కాన్షీరామ్ వర్ధంతికి హాజరైన బాస్ నాయకులు

పీలేరు రూరల్: భారతీయ అంబేడ్కర్‌సేన (బాస్) ఆధ్వర్యంలో పీలేరులో కాన్షీరామ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న కాన్షీరామ్ మరణించేదాకా గొప్ప పోరాటం చేశారన్నారు. బహుజన కులాలను సమీకృతం చేయడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు రవీంద్ర, మల్లికార్జున, ఆనంద, గురవయ్య, రమేష్ నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ గేమ్స్



పరుగు పందెం పోటీల్లో విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్ -14, 17 విభాగాల్లోని బాల,బాలికలకు రన్నింగ్ రేస్, హైజంప్, లాంగ్‌జంప్, జావెలింగ్‌త్రో పోటీలు జరిగాయి. విజేతలు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివశంకర్, పీడీలు భద్రయ్య, బాలాజీ, ఉమాదేవి, సుదాకర్, నరేష్, విజయకుమార్, గురు, శరత్, భారతి అంజనప్ప,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

నిమ్మనపల్లె: మండలంలోని బండ్లపై సచివాలయాన్ని ఎంపీడీఓ రమేష్‌బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్వమిత్వ సర్వే వివరాలనుఅడిగి తెలుసుకున్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నిర్లక్ష్యం లేకుండా శానిటేషన్ కార్యక్రమాలు చేయాలని, చెత్త సేకరణ సక్రమంగా చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, సెక్రటరీ ఆర్.ఎం.మహమ్మద్ పాల్గొన్నారు.

దృష్టి లోపాలపై శ్రద్ధ చూపాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దివ్య

మదనపల్లె రూరల్: దృష్టి లోపాలపై ప్రజలు తగిన శ్రద్ధ చూపాలని కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ఆస్పత్రిలో గురువారం పలువురికీ ఆమె అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 40 ఏళ్ల పైబడిన వారు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా యుక్తవయస్సులో దృష్టి లోపాలను అరికట్టవచ్చునన్నారు. దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారు కంటి చూపుపై శ్రద్ధ చూపాలని కోరారు. ఆప్తాల్మిక్ అధికారి కలాం ఆజాద్, జయశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఔషధాలపై పన్ను రద్దు

రాయచోటి టౌన్ : భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణల వలన ప్రజలకు అందుబాటు ధరల్లో మందులు లభిస్తాయని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య సూచించారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం దేవపట్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకృతి ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ తక్కువ ధరలకే లభిస్తున్నాయనే విషయం ప్రజలకు తెలపాలన్నారు. వెంకటేష్, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తారు రోడ్లున్నా.. బస్సు రాలేదన్నా!

మండలంలోని పలు మార్గాలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యమున్నా.. బస్సు సర్వీసులు నడపకపోవడంతొ ఆ ఫలాలు ప్రజలకు అందడం లేదు. సరిపడా బస్సులు నడపకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆటోలే దిక్కుగా మారాయి. ఆర్టీసీ అధికారులు కొన్ని మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపినా తదనంతరం ఒక్కసారిగా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నిత్యం బస్టాండులో బస్సుల కోసం జనం పడిగాపులు కాయాల్సి వస్తోంది.



బస్సు సౌకర్యాలు లేక ఆటోలో వేలాడుతూ ప్రయాణిస్తున్న జనం



తరిగొండ నుంచి తలారివాండ్లపల్లె వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు

- బస్సుసౌకర్యం లేక బస్టాండులో జనం ఇబ్బందులు
- రూ.17.45 కోట్లతో తారురోడ్లు ఏర్పాటుచేసినా తీరని కష్టాలు

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాలు, ప్రధాన రహదారులకు కలుపుతూ బస్సులు నడిచేలా గతంలో రూ.17.45 కోట్లతో తారు రోడ్లు నిర్మించారు. తరిగొండ నుంచి శెట్టివారిపల్లె మీదుగా తలారివాండ్లపల్లె వరకు రూ.3 కోట్లతో, బోడి గుట్టవారకు రూ..1.20 కోట్లతో, శ్రీనివాసపురం నుంచి ఎగువ బురుజుపల్లెకు రూ.3 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు నిర్మించారు. ఎగువఅమిలేపల్లె క్రాస్ నుంచి కలకడ వుండలం వడ్డిపల్లె రూ.2 కోట్లతోనూ, దిగువ తొట్లివారిపల్లె నుంచి గెరికుంట పల్లె మీదుగా నడిమికండ్రిగ వరకు మరో రూ.2.25 కోట్లతో రోడ్ల నిర్మాణం జరిగింది. మొటుకు క్రాస్ నుంచి మొటుకుమీదుగా ప్యారంపల్లె వరకు, వీటితో పాటు కలకడ–గుర్రంకొండ మార్గాన్ని రూ. 6 కోట్లతో డబుల్‌రోడ్డుగా మార్చారు. కోట్ల రూపాయలు ఖర్చుచేసి రోడ్లు నిర్మించినా వాటి ఫలాలు ప్రజలకు అందడం లేదు.

రోడ్లున్నా నడవని బస్సులు

కోట్లాది రుపాయల నిధులు ఖర్చుచేసి రోడ్లు వేసినా ఆయా మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులు నడపక పోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మండలంలోని 25 గ్రామాలకు సకాలంలో బస్సులు లేక ప్రయాణికులు నానా కష్టాలు పడుతున్నారు. కొన్ని గ్రామాల నుంచి బస్సు సౌకర్యం ఉండే రోడ్డుకు చేరుకోవాలంటే కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు సకాలంలో పాఠశాల, కళాశాలలకు చేరుకోవాలంటే నానా తంటాలు పడుతున్నారు. మొటుకు క్రాస్ నుంచి ప్యారంపల్లెకు గతంలో బస్సు నడపాలని గ్రామస్తులు ఆర్టీసీ అధికారులకు అర్జీలు పెట్టుకొన్నారు. గుర్రంకొండ నుంచి దిగువ అమిలేపల్లె, గంగిరెడ్డిగారిపల్లె, నక్కలవాండ్లపల్లె, ఎగువబురుజుపల్లె, రామాపురం, తరిగొండ మీదుగా వాల్మీకిపురానికి గతంలో ఆర్టీసీ బస్సులు నడిపేవారు. తదనంతర కాలంలో వాటిని రద్దు చేశారు. గుర్రంకొండ నుంచి మర్రిమాకులపల్లె, సింగంవారిపల్లె, రంగప్పగారిపల్లె వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు గతంలో నడిపినా ఇపుడు నిలిపివేశారు. దీంతో ప్రయాణం చేయాలంటే గ్రామీణులకు తీరని కష్టాలు మొదలయ్యాయి.

ప్రయాణికులకు ఆటోలే దిక్కు

ఈ మార్గాల్లో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోవాలంటే ఆటోలే దిక్కుగా మారాయి. ఆటోల్లో ఎక్కువమందిని ఎక్కించుకొని వెళుతూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యార్థులు కళాశాలలకు వెళ్లాలన్నా ఆయా మార్గాల్లో ఆటోల్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రజలు తమ పనుల మీద ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసిన అనంతరం ఆయా మార్గాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. నిత్యం బస్సుల వందలాది మంది ప్రయాణికులు బస్సు కోసం పడిగాపులు కాస్తున్నారు. అధికారులు స్పందించి బస్సు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సులు నడపాలి



మా గ్రామం నుంచి బస్సు సర్వీసులు నడవడం లేదు. రోడ్డు మార్గం ఉన్నా.. బస్సు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నాం. సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి. నిత్యావసర సరకులు, ఇతర వ్యవసాయ పరికరాలు, ఎరువులు తెచ్చుకోవాలంటే కష్టాలు పడాల్సి వస్తోంది.

– రెడ్డెమ్మ, గంగిరెడ్డిగారిపల్లె

విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు



మా ఊరి మీదుగా గతంలో బస్సు సర్వీసు నడిపేవారు. ఏడేళ్లుగా బస్సు నిలిపివేయడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు చేరులేక నానా కష్టాలు పడుతున్నారు. చివరకు ఆటోలో దిక్కుగా మారాయి. అవీ సకాలంలో అందుబాటులో ఉండడం లేదు. అధికారులు బస్సులు నడపాలి.

– నరసింహులు, చింతలవారిపల్లె

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కార్యకర్తను సన్మానిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుల్లంపేట: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం రాజంపేటలోని ఆకేపాటి ఎస్టేట్‌లో కార్యకర్తల సమావేశం ముగించుకొని వెళ్తుండగా స్థానిక బైపాస్‌లోని రామాలయం వద్ద వైఎస్సార్ పార్టీ కార్యకర్తలు, మండల పరిషత్ అధ్యక్షులు ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తుందని, అధికారం శాశ్వతం కాదని ఈ విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు. ప్రతి కార్యకర్త తాము ఎదుర్కొంటున్న సమస్యలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే డిజిటల్ బుక్‌లో నమోదైన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయనను శాలువాలతో సత్కరించగా తిరిగి ఆయన స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, క్రియాశీలక కార్యకర్తలు రాంబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

పేరుకే ఉచితం.. బాదుడులో ఘనం...!



మరుగుదొడ్ల వద్ద డబ్బు వసూలు చేస్తున్న సిబ్బంది



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

మదనపల్లె సిటీ: ఒకరు కాదు..ఇద్దరు కాదు... ఏకంగా వందలాది మంది ప్రయాణికుల నుంచి ప్రతి రోజూ రూ.10 అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండుల్లో ఉచితంగా వాడుకోవాల్సిన మూత్ర విసర్జనకు రూ.5, మరుగుదొడ్డికి రూ.2 వసూలు చేయాల్సి ఉండగా రూ.10 వసూలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే అంతే ఇవ్వాల్సిందేనని దురుసుగా ప్రవర్తిస్తుండడంతో ప్రయాణికులు ఏమీ మాట్లాడలేకపోతున్నారు. నత్యం తంబళ్లపల్లె, పీలేరు పుంగనూరు ప్రాంతాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణికులు అధికంగా వస్తుంటారు. బస్టాండులో స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఉన్నాయి. పరిశుభ్రత పాటించకపోవడంతో దుర్గంధం వస్తోంది. రోజూ వసూళ్లు దండుకుంటూ మూత్ర శాలలు మాత్రం శుభ్రంగా ఉంచడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. డిపో మేనేజర్ అమర్‌నాథ్ వివరణ కోరగా బస్టాండులో మూత్రశాలలు ఉచితమని, మరుగుదొడ్లకు రూ.2 చెల్లించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ



పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు

గుర్రంకొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన తీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత విషయాలు అడిగి తెలుసుకొన్నారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేశారా? అని ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వడ్డించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మెను ప్రకారమే ప్రతిరోజూ భోజనం వడ్డించాలని, పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. ఎంఈవో సురేంద్రబాబు, హెడ్మాస్టర్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి



నేరాలపై ఆరా తీస్తున్న డీఎస్పీ మహేంద్ర

తంబళ్లపల్లె: విధి నిర్వహణలో పోలీసులు అంకితభావంతో పనిచేయాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నేరాల అదుపు, పోలీసుల పనితీరు అంశాలపై ములకలచెరువు సీఐ వెంకటేశులు, ఎస్‌ఐ ఉమామహేశ్వరెడ్డిలను ఆరా తీశారు. పోలీసులు ప్రజలతో స్నేహభావంతో మెలగాలని, సమస్య విని పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు, మైనర్‌పిల్లలకు వాహనాలు ఇచ్చే అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాత్రి వేళ గస్తీలు నిర్వహించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గర్భిణులు, చిన్నారులకు అవగాహన



ప్రదర్శన తిలకిస్తున్న సీడీపీఓ సుజాత

తంబళ్లపల్లె: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు శారీరక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత కోరారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కురబలకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపోషిత్ భారత్, సక్షమ్ భారత్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య అంశాలపై వివరించారు. ఫోర్డు ప్రతినిధి నరసింహులు ఆలపించిన చైతన్య గీతాలు ఆకట్టుకున్నాయి. చిరుధాన్యాలతో వండిన వంటకాలు, పప్పు దినుసులు, కూరగాయాలు, ఆకుకూరలలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ బాలికలు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ లక్ష్మన్న

కేవీపల్లె: మైనర్ బాలికలు తమను తాము కాపాడుకోవడానికి అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆర్.లక్ష్మన్న పేర్కొన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నందు మైనర్ బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు సమాజంలో ధైర్యంగా ఉండాలని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో జరిగే అకృత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అపరిచితుల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఆపదలో ఆదుకునేందుకు తాము ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటామని తెలిపారు. ఆపద సమయంలో 112, 100, 1098 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాషా, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప, ప్రిన్సిపాల్ శీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు, మందులపై జీఎస్టీ తగ్గింపు



కలికిరిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



రామసముద్రంలో ర్యాలీ



తంబళ్లపల్లెలో జీఎస్టీపై వివరిస్తున్న ఎంపీడీఓ

పీలేరురూరల్: పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా వైద్య పరికరాలు, మందులపై ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని సీహెచ్‌వో సరస్వతి పేర్కొన్నారు. స్థానికి జేకే.కాలనీలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్రాక్షాయని, శివప్రసాద్, సుస్మిత, సుమలత, నందిని, యల్లమ్మ, నారాయణమ్మ, రేణుక, వీరకుమారి, శ్రీదేవి, ఆసిఫా, రెడ్డిప్రసాద్, సారిక, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం: రామసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు, అధికారులు కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మదనపల్లి ఏసీటీఓ రఫీ, ఈవోపీఆర్డీ గపూర్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలపై జీఎస్టీ రద్దు చేయడంతో లాభం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ఎన్డీఏ ప్రభుత్వం అమలుచేస్తున్న సూపర్ జీఎస్టీపై అవగాహన ముఖ్యమని ఎంపీడీఓ బాపూజీపట్నాయక్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో మందులపై ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీపై పలువురికీ అవగాహన కల్పించారు. మందులపై ఉన్న 12 శాతం జీఎస్టీపై ఇప్పుడు 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్వి, డాక్టర్ అమరసింహరాజు, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: ఆరోగ్య బీమా పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తొలగించిందని కలికిరి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పవన్‌కుమార్, ఎంపీడీఓ భానుమూర్తిరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0పై స్థానిక సీహెచ్‌సీలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఆరోగ్య రంగంలో ప్రజలకు ఎంతో మేలు కలిగిందని వివరించారు. మందుల ధరలు తగ్గినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలికిరి పంచాయతీ ఈవో అశోక్, వెంకటేష్, ఉదయ్ కిరణ్, శశికుమార్, విజయచంద్రిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

రాయచోటి: వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సురేందర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం రాయచోటిలోని విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉపకేంద్రాలలో ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే కొత్తగా సర్వీసులు తీసుకున్న విద్యుత్ వినియోగదారులకు ఎస్‌టీపీ నిబంధనల ప్రకారం సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ముందస్తు చర్యలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే త్వరితగతిన పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అధికలోడు ఉన్న ప్రాంతాలలో అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య రాకుండా చూడాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు ఓఅండ్‌ఎం సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అన్నమయ్య సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్,అ సిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్య అవసరం



మాట్లాడుతున్న మేరీ

సిద్దవటం : విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా ఒత్తిడి లేని విద్యనందించాలని సమగ్ర శిక్ష జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి మేరీ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా సిద్దవటం మండలంలోని 11వ బెటాలియన్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ప్రశాంతత భావోద్వేగ సమతుల్యత ఒత్తిడి నియంత్రణ పద్ధతులపై మార్గదర్శకాలు ఇచ్చారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఉత్సాహంగా ఆహ్లాదమైన ప్రదేశంలో విద్యను అభ్యసించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంకటసుబ్బయ్య, సమీర్ బాషా, సిరాజుల్లా, రవిశంకర్, మహబూబ్‌బాషా, చంద్రశేఖర్, మౌలాలి విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తాం



తంబళ్లపల్లె: ఎంఈఓకు లేఖ ఇస్తున్న నాయకులు



మదనపల్లి సిటీ: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ: బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలు బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు పురం వెంకటరమణ, నరసింహులు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి బోధనేతర పనులు నిలిపివేస్తున్నామని, పాలకుల అనాలోచిత నిర్ణయాలతో విద్యారంగం బలహీనపడుతోందని పేర్కొన్నారు. పిల్లలకు పాఠాలు చెప్పనీయకుండా ఉపాధ్యాయులకు సంబంధంలేని పనులు చేయమని బలవంతం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఫ్యాప్టో నాయకులు శేఖర్‌రెడ్డి, మల్లీశ్వరబాబు, నరసింహారెడ్డి, హరిబాబు, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం: శుక్రవారం నుంచి విద్యేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు రామసముద్రం మండల ఫ్యాప్టో నాయకులు ఆయూబ్ ఖాన్, రమాదేవి తెలిపారు. ఎంఈవో హేమలతకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బహిష్కరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న కర్మయోగి, విద్యాశక్తి , సాస, జీఎస్టీ పై ప్రచారం, మూల్యాంకన బుక్‌లెట్స్, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర,, రకరకాల యాప్స్ వంటి కార్యక్రమాలతో పిల్లలకు సరైన బోధన చేయలేకపోతున్నామని తెలిపారు. నరసింహులు, కృష్ణమూర్తి, మహేష్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండంలోని ఫ్యాప్టో నాయకులు బోధనేతర పనుల బహిష్కరణ లేఖను ఎంఈఓ త్యాగరాజకు గురువారం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు రెడ్డప్పరెడ్డి, సాంబశివ,పద్మావతి, యాహసాన్, వెంకటకుమార్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లె: బోధనేతర పనులను బహిష్కరిస్తూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం ఎంఈఓ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, బి.మోహన్, గోబ్రియా నాయక్, రవీంద్ర పాల్గొన్నారు.

సచివాలయం ఎదుట కాలనీవాసుల ధర్నా



నిరసన తెలుపుతున్న శివాలయం వీధి వాసులు

మదనపల్లె రూరల్: కోళ్లబైలు పంచాయతీ శివాలయం వీధిలో మౌలిక వసతులు కల్పించాలని ఆ కాలనీవాసులు డిమాండ్ చేశారు. బయ్యారెడ్డికాలనీ సచివాలయం ఎదుట బైఠాయించి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శివాలయం వీధికి సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. ఇంటి చుట్టుపక్కల గడ్డి, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో పాముల బెడద అధికంగా ఉందని, చిన్నపిల్లలు, పెద్దలు బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాలువలు లేక మురుగు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయని, ఇప్పటికే కాలనీలో పలువురు విష జ్వరాలతో బాధపడుతున్నారని అన్నారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఎస్.నరసింహులు, గంగిరెడ్డి, లక్ష్మీ, రెడ్డెమ్మ, శ్రావణి, కళావతమ్మ, తిమ్మమ్మ, జయలలిత, లావణ్య, భారతి, జుబేదా, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శివరాం

మదనపల్లె: మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్గా జంగాల శివరాంను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే షాజహాన్బాషా, వైస్ చైర్మన్గా రామిశెట్టి ఆంజనేయులు, డైరెక్టర్లుగా బర్నేపల్లి సంధ్యారాణి, ఆర్.సుబ్రహ్మణ్యంరెడ్డి, బండారి ప్రమీల, సి.నరసింహులు, బి.మున్నా నాయక్, బి.మణి, పి.వాణి, బొంత శ్యామలమ్మ, గడ్డం లక్ష్మీపతి, రోనూరు అరుణ, ఎం.రెడ్డమ్మ, బి. నూరున్నిసాలను నియమించారు. వీరుగాక కొందరు అధికారులు కూడా ఈ కమిటీలో సభ్యులుగా కొనసాగుతారు.